# భగవంతుడు ప్రేమ స్వరూపుడు

ఆకారమే లేని ఆ నిరాకారున
కాకారమును దెల్ప నెవరి తరము
కరచరణంబులే కలుగని వానికి
ఏమి సొంపును మదినెంచగలరు
అట్టిది యిట్టిది ఆ రూపు యీ రూపు
యని పల్కుటెల్ల హాస్యాస్పదంబు
కోటి దీప్తుల కాంతి మేటి కలిగిన తనకు
ఎట్టి రూపము మదినెంచగలరు

రూపమేలేని శక్తికి రూపుదెల్ప
ఎవరి తరమౌను సాధ్యము ఏరికౌను
ఆత్మ యాకార రహితమై యాది నుండి
దిగ్దిగంతము లందున దీప్తి చెందె

ప్రేమ రూపంబు బ్రహ్మంబు ప్రేమమయము
ప్రేమ ప్రేమతో సంధింప నీమ మగును
కాన ప్రేమను పూర్తిగా కలిగియున్న
అద్వితీయము నొందంగ అర్హుడగును.

**పవిత్రాత్మ స్వరూపులారా!**

ఈ నామము మీకు ఏ విధముగా కలిగినదనే విషయాన్ని మీరు గుర్తించాలి. పవిత్రము. ఇది లాటిన్ పదము విర్ అనే పదము నుండి ఆవిర్భవించినది. విర్ అనగా మానవుడు అని. ఏతావాతా ఈ పవిత్ర స్వరూపుడే మానవుడు. ఆత్మ దివ్యత్వముతో కూడినది. రోమన్ దేశము క్రిష్టియన్ దేశము అయిన తరువాత జీసస్ పవిత్రమైన హృదయము కలిగినవాడని అతనికి

srisathyasaivachanamrutam

ఒక పవిత్రమైన పేరును సార్థకము గావించే నిమిత్తమై పెట్టినారు. అదియే Persona అనే పదము. Persona అనగా ఒక దివ్యత్వమని. ఈ Persona అనే రోమన్ పదమునుండే Person అనే ఆంగ్లపదము ప్రారంభమైంది. ఈ Person అనే పదమునుండి మన భారతీయ సంస్కృతిని పురస్కరించుకొని వ్యక్తి అనే పదము వచ్చింది. వ్యక్తి అనగా అవ్యక్తమైన దానిని వ్యక్తీకరింపచేసేది. ఏది అవ్యక్తముగా ఉన్నది? దివ్యత్వమే అవ్యక్తముగా ఉన్నది. అదియే ఆత్మ. కనుకనే మానవత్వములో దివ్యత్వముగా వుండిన ఆత్మను వ్యక్తీకరించే పవిత్రుడు కనుకనే మానవునికి పవిత్రాత్మ స్వరూపులారా అనే నామము సార్థకమైంది.

**భగవంతుడు ప్రేమ స్వరూపుడు**

భగవంతుడు ప్రేమ స్వరూపుడు. అతనియొక్క అంశమే మానవుడు. కోపములేని మానవుడు ఉండవచ్చును. లేక సత్యములేని మానవుడు ఉండవచ్చును. శాంతి లేని మానవుడు ఉండవచ్చును. కాని ప్రేమలేని మానవుడు జగత్తులో ఉండుటకు వీలుకాదు. సర్వమానవుల యందిది ఏకత్వమై, దివ్యత్వమై ప్రకాశించే ప్రేమతత్త్వము సమత్వముగా ఉంటున్నది. ఈ ప్రేమను నవవిధ మార్గములలో అనుభవించవచ్చును. కానీ ప్రేమ ఒక్కటియే. కనుకనే మానవుడు కూడను భగవంతుని యొక్క చిదాంశమే. కానీ దురదృష్టవశాత్తు మానవునియొక్క ప్రేమ బాహ్యసంబంధమైన ప్రకృతియందు ప్రసరించటముచేత మానవుని హృదయమునందు ఈ భగవత్తత్త్వమనేది ప్రతిబింబించలేకపోతున్నది. ప్రాకృత సంబంధము చేత మనసు మాలిన్య మవుతున్నది. కనుక మానవుని ప్రేమ దూషిత మవుతున్నది. ఇట్టి దూషితమైన మానవ సరోవరమునందు భగవంతుని సుందర వదనార విందము ప్రకాశించ లేకపోవుచున్నది.

ఏనాడు మానవుని యొక్క ప్రేమ పరమాత్ముని వైపు ప్రసరించునో, దివ్యత్వమువైపు ప్రసరించునో ఆనాడే ఈ భగవత్తత్త్వమనేది సుక్షేమముగా సురక్షితముగా తనకు ప్రకటింప చేస్తుంది. కదిలే జలములో ప్రతిబింబమైన చంద్రుడు కదలినట్టుగా ఉంటుంది. సుస్పష్టమైన జలములో ప్రతిబింబించే చంద్రుడు సుస్పష్టముగా కనిపిస్తాడు. మాలిన్యమైన జలములో ప్రతిబింబించే చంద్రుడు మాలిన్యముగానే కనిపిస్తాడు. కనుక మానవుని మనస్సే సరోవరము. ఈ సరోవరము చంచలత్వముతో కూడినప్పుడు అందులో ప్రతిబింబించే చిదాత్మ స్వరూపమైన



srisathyasaivachanamrutam

ప్రేమతత్త్వము కూడను చంచలముగానే కనిపిస్తుంది. మానవుని మనస్సు నిశ్చలమై, నిస్స్వార్థమై, సుస్పష్టమైన జలముగా ఉండినప్పుడు అందులో భగవంతుడు సుస్పష్టముగానే గోచరిస్తాడు. కానీ ఈనాటి మానవుని మనస్తత్వము అనేకత్వమైన, ప్రాకృతమైన భావముచేత కూడిఉండటంచేత ఇది మాలిన్యమైపోతున్నది. సర్వత్రా ఉండినది భగవత్ తత్త్వమైనప్పటికిని తన మానస సరోవరమునందు ఏమాత్రము ప్రతిబింబించ లేకపోవుచున్నది. సర్వాంతర్యామియైన భగవత్ తత్త్వమునందు తేడా ఏ మాత్రము లేదు. సర్వత్రా ఉండిన భగవత్ తత్త్వము తనయందు ప్రతిబింబింప చేస్తున్నదే తనయందు కూడను ఉన్నది. చాలామంది భగవంతుడు నా హృదయంలో ఉన్నాడు అంటూ ఉంటారు. ఇది చాలా పొరపాటు. ఇది సరియైన తత్త్వము కాదు. ఇది కేవలము భగవంతుని కించ పరచినటువంటి సత్యము. ఇది ఒక పుష్పము. ఈ పుష్పము ఎక్కడ ఉంది? నా చేతిలో వుంది. అప్పుడు నా చేయి పెద్దది ఈ పుష్పము చిన్నది. భగవంతుడు నాలో ఉన్నాడంటే నీవు పెద్దవాడు భగవంతుడు చిన్నవాడు. కనుక నీవే పరమాత్మునిలో ఉన్నావుగాని పరమాత్మ నీలో లేడు. ఇట్టి విశాలమైన సత్యాన్ని మనము గుర్తించినప్పుడు దివ్యత్వము మనకు అర్థమవుతుంది. కానీ భగవత్ తత్త్వాన్ని ఈనాడు సంకుచితమైన భావముల చేతను అనుభవించటానికి ప్రయత్నిస్తున్నాము.

కనుకనే తెలిసి మెలుగు అన్నారు. తెలిసి జీవించు అన్నారు. జీవితముపైనే నమ్మకము లేని మానవునికి ఆత్మవిశ్వాసము ఏరీతిగా కుదురుతుంది. ఆత్మవిశ్వాసము లేని వానికి మనస్సు అన్ని విధములా అనుమానముల పైననే ప్రసరిస్తుంది. అనుమానగ్రస్తుడైనవానికి సుఖశాంతులు శూన్యము. దృఢమైన విశ్వాసము లేనప్పుడు మానవుడు తనను తానే నమ్మలేడు. తనను తాను నమ్మలేని మానవుడు ఇతరులను ఏరీతిగా నమ్మగలడు. ఇతరులను నమ్మలేని మానవుడు ఏ విధముగా తాను లోకములో కార్యాన్ని సాధించగలడు. అసాధ్యము. కనుకనే మానవుడనగా నమ్మకమైన జీవి అని దీని అర్థము. నమ్మిన దానిని ఆచరణలో పెట్టినప్పుడే నమ్మకము అభివృద్ధి అవుతుంది. దానితోబాటు శాంతి భద్రతలు కూడను తనను వెంటాడుతూ ఉంటాయి. కనుకనే మానవత్వమునకు ఈ పవిత్రమైన నమ్మకము అభివృద్ధి గావించటానికి ప్రేమనే ప్రధానమైన సూత్రము. భగవంతుని ప్రార్థన చేస్తుంటారు. ప్రార్థన అనగా కేవలము భగవంతుని అడుక్కోవటము కాదు. భగవంతుని హృదయానికి హత్తుకోవటము. అడుక్కోవటమనే తత్త్వాన్ని

sri sathyasai vahanamrutam

మనము విస్మరించి హత్తుకునే తత్త్వానికి మనము ప్రయత్నించాలి. భగవంతుని యొక్క ప్రేమ నిమిత్తమై మనము ప్రాకులాడాలి అదే నిజమైన తపస్సు. కనుక ఎదురు చూచేదే తపస్సు ఎదురు తిరిగేదే తమస్సు అన్నారు. తపస్సనగా కేవలము ఇల్లువాకిలి వదలి ఆలుబిడ్డలను వదలి అరణ్యమునకు పోయి కూర్చోవటము కాదు. తపస్సనగా మనస్సునందున్న దుష్టభావములు వీడి భగవంతుని అనుగ్రహం నిమిత్తమై అఖ్ఖులు చాచి ఉండటమే కనుక ప్రేమనే ఇందులో ప్రధానమైన సూత్రము. ప్రేమకు మించినది మరొక్కటి లేదు. జగత్తులో ప్రేమచేత సర్వము సాధించవచ్చును. కనుక అట్టి ప్రేమ నిమిత్తమై మనము తగిన ప్రయత్నములు చేయాలి.

## ప్రేమతత్త్వమే భక్తి

తన మనస్సు, తన అభీష్టములు సర్వము భగవంతునికి అర్పితముచేసి ఆ అనుగ్రహం నిమిత్తమై మనము ప్రాకులాడటమే నిజమైన భక్తి. భక్తి అనగా కొలువు అని ఒక అర్థము. సేవ అని రెండవ అర్థము. మూడవది భయముతో కూడిన స్నేహమని అర్థము. భగవంతునితో విభక్తము కానిదే భక్తి. ఎట్టి సమయమునందైనా, ఎట్టి కాలమునందైనా, ఎట్టి ప్రదేశమునందైనా, ఎట్టి విషయమునందైనా భగవంతునితో ఏమాత్రము ఎడబాటు సంభవించకూడదు. ఏదో మీ భక్తి ఈనాడు ఒక పూజ రూము వరకు మాత్రమే పరిమితమవుతున్నది. ఒక దేవాలయము వరకు మాత్రమే పరిమితమవుతున్నది. ఆ దేవాలయములో ఉండినంతవరకు, ఆ పూజామందిరములో ఉండినంతవరకు మన భక్తి ప్రపత్తులు మహావేగముగా ఉంటుంటాయి. పరమశాంతముగా ఉంటుంటాది. కానీ ఆ ప్రదేశము వదలితిమా కస్సు బుస్సు అని కదలుతూ ఉంటాము. ఇది సరైన భక్తి కానేరదు.

మన వ్రతములకు, మన నియమములకు, మన కాలమునకు, మన ప్రదేశమునకు, మన కర్మలకు అతీతమైన ప్రేమతత్త్వమే భక్తి. దేశకాల పరిస్థితుల ప్రభావమునకు ఏమాత్రము అది గురికాకూడదు. సర్వకాల సర్వావస్థలయందు కూడను దైవత్వమనే ప్రేమతత్త్వాన్ని మనము అభివృద్ధి పరచుకోవాలి. కనుకనే సతతం యోగినః అన్నారు. ఇలాంటి పవిత్రమైన ప్రేమతత్త్వాన్ని మనము అనుభవించే కోసము, అందుకునే కోసం, అందుకున్న ఆనందమును తిరిగి పదిమందికి

srisathyasaivachanamrutam

పంచేకోసము తగిన కృషి చెయ్యాలి. మన ఆర్థికమునుగాని, మన ఆశయాలుగాని సరిగా నెరవేరనప్పుడు భగవంతునిపై భక్తి కొంత చలిస్తూ ఉంటుంది. ఇది భక్తికి ఏమాత్రము కూడను సంబంధమైనది కాదు. భక్తి హృదయమునకు సంబంధించినదేగాని దేహమునకు సంబంధించినది కాదు. దేహమునకు సంబంధించిన కష్టములకు, నష్టములకు, దుఃఖములకు, విచారములకు ఈ హృదయమునకు సంబంధించిన భక్తి ప్రపత్తులను ఏవిధముగా మనము తిరస్కరిస్తాము. దేహమునకు అతీతముగా ఉండే ప్రేమతత్త్వమే భక్తి. దీనినే పరమభక్తి అనికూడను చెప్పవచ్చును. దీనినే అనన్యభక్తి అనికూడను చెప్పవచ్చును. కనుక ఇట్టి అనన్యభక్తిని కలిగిన చిత్తమే హృదయానికి హత్తుకుంటుంది. కాలానుగుణముగా మనము మారకూడదు. మన ప్రవర్తనలు కొంతవరకు మార్చుకోవాలి.

## ప్రేమతత్త్వమే దివ్యతత్త్వము

ప్రేమస్వరూపులారా! ప్రభావమునకు లొంగి మన స్వభావమును కోల్పోతున్నాము. మన స్వభావమును సుస్థిరమైన స్థితిలో మనము ఉంచుకోవాలి. అదే దృఢమైన భక్తి. భక్తుడు కేవలము ప్రేమానుభవాన్ని మాత్రమే కోరుతూ ఉంటాడుగాని ఆడంబరమునకు అహంకారమునకు ఏమాత్రము గురికాడు. ప్రేమ, సానుభూతి అతనికి అత్యవసరము. అట్టిది కానిది ఎట్టిదైనను తాను అంగీకరించడు. అద్దములో కనిపించే తిను పదార్థములు కంటికి మాత్రమే అందునుగాని మన అనుభూతికి రావు కదా. మన ఆకలిని తీర్చదుకదా! ఆనందమును అందించలేదు. అదేవిధముగానే భక్తుడు భగవంతుని ప్రేమానుభవమును అనుభవించటానికి తగిన కృషి చేస్తున్నాడుగానీ ఈ ఆడంబరముల కోసమని లేక అహంకారము కోసమని స్వార్థము, స్వప్రయోజనము నిమిత్తమై ఈ ప్రేమను అనుభవింపచేయడు. కనుకనే ఈ ప్రేమతత్త్వమనేది హృదయానికి హత్తుకునే దివ్యత్వమే. లోకములో యోగమని, జ్ఞానమని, కర్మ అని, భక్తి అని అనేక విధములుగా ఉచ్చరిస్తూ ఉంటారు. ఇవన్నియు కేవలము అవినాభావ సంబంధము అన్యోన్య ఆశ్రయములే. ఇందులో ప్రత్యేకమైన తత్త్వము భక్తియే. మొదటిది కర్మమార్గము. లోక క్షేమ నిమిత్తమై, లోకానుగ్రహ నిమిత్తమై, లోక కళ్యాణము నిమిత్తమై అనేక విధములైన సత్కర్మలు ఆచరిస్తూ ఉంటాడు. యజ్ఞయాగాది క్రతువులలో పాల్గొంటాడు. సమాజసేవలో

srisathyasaivachanamrutam

కూడను పాల్గొంటాడు. ఇవన్నీ కర్మలయొక్క లక్షణములు.

అయితే ఈ కర్మలలో చాలావరకు కష్టము ఉంటున్నాది. యజ్ఞయాగాది క్రతువులు ఆచరించవలెనన్న వేదములు శాస్త్రములు చక్కగా తెలుసుకొని ఉండాలి. వేదశాస్త్ర ఇతిహాస పురాణముల యొక్క ప్రమాణములు తాను గుర్తించి ఉండాలి. సామాన్యమైన ప్రజలకు ఇది అసాధ్యము. ఇంక జ్ఞానము. శాస్త్ర జ్ఞానము, గ్రంథ జ్ఞానము, అనుభవ జ్ఞానము, ఆచార జ్ఞానము, సామాన్యమైన జ్ఞానము ఈ అన్ని జ్ఞానముల యొక్క సారాన్ని కలిపినప్పుడే నిజమైన ఆత్మజ్ఞాన మవుతుంది. సర్వగ్రంథముల యొక్క సారము, సమస్త మతముల యొక్క దివ్యత్వము, సర్వమార్గముల యొక్క గమ్యము ప్రేమతత్త్వము ఒక్కటే. కానీ ఈ జ్ఞానమునందు మానవుడు అంత ఉత్తీర్ణుడు కావటానికి అవకాశము ఉండదు. అద్వైత దర్శనం జ్ఞానం అన్నారు. అనగా అనేకత్వములోనున్న ఏకత్వమును గుర్తించటమే జ్ఞానము అన్నారు. అదే మన భారతీయులు ప్రప్రథమముగా అందించినది. వందనం నమస్కారము. అనగా అనేకముగా ఉండిన ఈ వ్రేళ్లను ఏకముగా చేర్చటమే నమస్కారము. అనేకత్వములోని ఏకత్వాన్ని నిరూపిస్తూ వచ్చారు. కనుకనే మానవత్వము లోపల ఏకత్వమనేది అంత సులభముగా మనము అందుకోలేము. ఐతే యోగము. యోగః చిత్తవృత్తి నిరోధకః. ఈ చిత్తము నరికట్టటమనేది మరింత కష్టమైన విషయము. మానసిక ఇంద్రియములను అరికట్టుకోవటము ఇంత సులభమైనది కాదు. కఠినమైన సాధన సల్పినప్పుడే ఇది సాధ్యమవుతుంది. అనేక కష్టములకు, నష్టములకు, దుఃఖములకు, విచారములను కూడను ఎదుర్కొనవలసి వస్తుంది. అయితే జీవితములో జరిగే కష్టములను నష్టములను ఎదుర్కొన్న మానవుడే కొంతవరకు ధన్యుడౌతాడు. వీటినన్నింటిని నెట్టుకొని, తట్టుకొని ముందుకు కొనసాగే ధైర్యము మానవునియందు చాలా తక్కువ. కనుక యోగాభ్యాసము చాలా దుర్లభమైనది. కష్టమైనది. భక్తి చాలా సులభమైనది. దీనికి వేదశాస్త్ర ఇతిహాస పురాణములు చదవనవసరము లేదు. ఏ యజ్ఞయాగాది క్రతువులు ఆచరించనక్కర లేదు. అనేకత్వములోని ఏకత్వమును గుర్తించనక్కరలేదు. కేవలము భగవంతుని ప్రేమచేత తమ తమ ఇంద్రియములు తమపాటికి హద్దులో నిల్చిపోతాయి.

**ఆచరణలో పెట్టినదే నిజమైన ఆస్తి**

srisathyasaivachanamrutam

ఈనాడు గ్రంథములు పఠించినవారుగాని కేవలము పాండిత్యమును మాత్రమే పొందగలుగుతున్నారుగాని ఆచరణలో ఏమాత్రము అనుభూతి కలిగించటం లేదు. ఆ ఆచరణలో పెట్టినదే మనకు నిజమైన ఆస్తి. ఆచరణలేని విద్యలు ఎన్ని చదివినప్పటికిని అవి కేవలము ఆడంబరములతో కూడినవే. కనుక ఒకటి రెండైనను మనము ఆచరణలో పెట్టటానికి తగినకృషి చెయ్యాలి.

**సకల విద్యలు నేర్చి సభ జయించగ వచ్చు**
**శూరుడై రణమందు పోరవచ్చు**
**రాజరాజైపుట్టి రాజ్యమేలగ వచ్చు**
**హేమ గోదానము లీయవచ్చు**
**గగన మందున్న చుక్కల లెక్కగొనవచ్చు**
**జీవరాసుల పేర్లు చెప్పవచ్చు**
**అష్టాంగ విద్యల నభ్యసించగవచ్చు**
**చంద్రమండలమైన చేరవచ్చు**
**కాని దేహేంద్రియములరికట్టి ఎపుడు**
**మనసు నిల్పి యంతర్ముఖముగను జేసి**
**నిశ్చల సమాధి చిత్తుడై నిలువలేడు**

కనుక ఈ ప్రేమతత్వాన్ని నిలుపుకునే మార్గమే మానవుని ప్రధానమైన లక్ష్యము. మానవునకు ఐదు విధములైన భక్తి తత్వములు కలవని శాస్త్రములు బోధిస్తున్నాయి. బ్రహ్మతత్వము, దైవతత్వము, ఇంద్రతత్వము, చంద్రతత్వము, అమరత్వము. ఈ ఐదింటి కంటెను ప్రేమతత్వమే ప్రధానమైనదిగా భావించారు గోపికలు. మానవుని యందే సమస్తము ఇమిడి ఉంటున్నది. ప్రతి ఒక్క తత్వము మానవునియందే ఆవిర్భవించుతున్నాయి. ఇవన్నియు ఒక ప్రేమ అనే పాశముతోనే కట్టబడి ఉంటున్నాయి. కేవలము మణులయందు సూత్రము చేరినట్టుగా అందరి మానవులయందు ఈ ప్రేమసూత్రము సమత్వముగా ప్రసరిస్తూ పోతున్నది. కనుక సమస్త భావములను, సమస్త మార్గములను, సమస్త ధర్మములను, సమస్త కీలకములను, సమస్త

srisathyasaivachanamrutam

గమ్యములను చేర్చేది ప్రేమతత్త్వము ఒక్కటి మాత్రమే.

**తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు**
**తిరిగి కుందేటి కొమ్ము సాధింపవచ్చు**
**భజన లేకుండ పరభక్తి పొందలేరు**
**తత్త్వమెరుగక భవవార్ధి దాటలేరు**

కనుక ప్రేమతత్త్వాన్ని పొందినవారు మాత్రమే ఈ భవమును దాటగలరు. కనుక మన సర్వస్వము భగవంతునికి అర్పితము గావించి తన ప్రేమానందము కోరటమే ప్రధానమైన మార్గము.

ఒక చిన్న ఉదాహరణము. ఒక కన్యకు పెండ్లి అయిన తక్షణమే తన సర్వస్వముగా భావించిన సర్వము కూడను, కనిపించి పెద్ద చేసిన తల్లిని, పోషించి, అభివృద్ధిచేసి కళ్యాణము గావించిన తండ్రిని, తోబుట్టిన అక్కచెల్లెండ్లను, అన్నదమ్ములను విడిచి ఒక నూతనమైన వ్యక్తితో సంపూర్ణ విశ్వాసముతో అతనివెంట పోతుంది. తనయింటి యందున్న భోగభాగ్యములను ఏమాత్రము తాను ఆశించదు. అదేవిధముగనే మన మనస్సు యొక్క తత్త్వము భగవంతునికి అర్పితము గావించిన తరువాత తన మనస్సు, తన ధనము, తన మానము, తన భావము, తన ప్రేమ సర్వము భగవంతునికి అర్పితమై పోతుంది. అదియే నిజమైన అనన్యభక్తి అన్నారు.

**భగవంతుడు జ్ఞాన భాస్కరుడు**

ఒక పదార్థమును త్యాగము చేయక మరొక పదార్థము అందుకొనుటకు అర్హత లేదు. మనలోనున్న అశాంతిని అర్పితము చేసినప్పుడే సమానత్వము మనలో పెంపొందుతుంది. ద్వేషము త్యాగము చేసినప్పుడే ప్రేమ మనలో ఆవిర్భవిస్తుంది. ఒకదానిని మనము త్యాగము చేయక మరొకదానిని పొందటానికి ఏమాత్రము అవకాశముఉండదు. షాపుకి వెళ్లి పదిరూపాయలు షాపుకీపరుకు ఇచ్చినప్పుడే వాడు ఒక కర్చీఫ్ మన ముఖాన కొడతాడు. నీవు ఆయా పదార్థములకు చెల్లించవలసిన సుంకము చెల్లించినప్పుడే ఆ పదార్థము నీకు దక్కుతుంది. చిక్కుతుంది. అట్లు చెల్లించక, అట్లు అందించక పరమ పవిత్రమైన ప్రేమతత్త్వము లభ్యము కావాలంటే సాధ్యమా? ఒక్కొక్క సమయమునందు భగవంతుడు అనేకమందిని అనేక విధములుగా పవిత్రమైన, ఉన్నతమైన మార్గానికి తెప్పించే నిమిత్తమై బాధలనందిస్తాడు. కష్టములు

srisathyasaivachanamrutam

కలిగిస్తాడు.

అగ్నికి ఆకర్షణ శక్తి లేదు కానీ సమీపించినవానికి వెలుతురును వేడిని అందిస్తుంది. అదేవిధముగానే భగవంతుడు జ్ఞాన భాస్కరుడు. అతనిని సమీపించిన వానికి దుఃఖములు, కష్టములు నివారణ అయిపోయి ఆనందము సుఖము ప్రాప్తిస్తుంది. అంతేకాదు. భగవంతుని సమీపము లేకుండా దూరముగా ఉండినట్లుగా భావము తలచినప్పుడు భగవంతుని అనుగ్రహముగాని, భగవంతునికృపగాని ఏరీతిగా మనకు లభ్యమవుతుంది. భగవంతుడు మాటలాడలేదే, భగవంతుడు దర్శనమీయలేదే, భగవంతుడు నన్ను పలుకరించలేదే అని ఈ విధముగా విచారణచేస్తే వచ్చే ఫలితము ఏమిటి? నీవు మానసికముగా భగవంతునికి ఎంత సమీపములో ఉన్నావు. నీవు ఆచరణలోపల భగవంతునికి ఎంత సమీపములో వెడుతున్నావు. మొట్టమొదట తనను తాను పరిశీలన చేసుకోవాలి. అంతేగాని భగవంతునికి ఆగ్రహముగానీ అనుగ్రహముగానీ రెండు లేవు. అయితే ఆగ్రహములోకూడను అనుగ్రహము ఉంది. దండములో కూడను దయ ఉంది. కోపములో కూడను కృప ఉన్నది. భగవంతుని యొక్కతత్త్వము చక్కగా అర్థము చేసుకున్నవారికే ఇది చక్కగా అర్థమవుతుంది. సరియైన మార్గములో ప్రవేశింపజేసి భక్తుని ఆదర్శవంతమైన జీవితములో అర్పించే నిమిత్తమై కొన్ని విధములైన శిక్షలనందిస్తూ ఉంటాడు. ఆ శిక్ష మన రక్ష నిమిత్తమేగాని అని మనము భావించాలి.

**కష్టము లేకుండా సుఖము లేదు**

ఒకానొక తోటమాలి తెల్లవారి మొదలు రాత్రి వరకు కూడను కడవ తలపైన పెట్టుకొని మొక్కలకు నీరుపోసి చాలా దానిని అభివృద్ధి గావిస్తూ వచ్చాడు. ఒకనాడు అతనికి తల బాధ వచ్చింది. తలపైన ఉన్న కుండను క్రింద పెట్టటానికి ప్రయత్నము చేసి ఇంటికి వెళదామా అని విచారిస్తున్నాడు. అప్పుడు పైనున్న కుండ అతనికి ఒక చక్కని ప్రబోధ చేసింది. పిచ్చివాడా కష్టేఫలే. కష్టము లేకుండా మనకు సుఖము లభించదు. నా విషయమే నీకు ఆదర్శము. బోధిస్తాను వినమంది. నేను మొట్టమొదట అందరి కాళ్ల క్రిందన దుమ్ముగా ధూళిగా ఉండేదానిని. ఆ మట్టిని కుమ్మరివాడు తెచ్చి కాళ్లతో తొక్కి నన్ను అనేక బాధలుపెట్టాడు. కడపటికి చక్రములో పెట్టి నన్ను అనేక విధములుగా చుట్టిపెట్టాడు. తరువాత అగ్నిలో వేసి కాల్చినాడు. నన్ను

srisathyasaivachanamrutam

కొనటానికి వచ్చినవారు ప్రతి ఒక్కరు నన్ను మొట్టికాయలు కొట్టి నన్ను స్వీకరించారు. ఇన్ని కష్టములకు నేను గురికావటంచేత ఈనాడు అందరిశిరస్సుల పైననేను నాట్యమాడుతున్నాను. ఈ కష్టములకే నేను భరించుకోకుండా ఉంటే నేను అందరి శిరస్సుపైనా ఎట్లా చేరి ఉండేదాన్ని. కనుక నీవు కూడను అనేక కష్టములకు, నష్టములకు, దుఃఖములకు, విచారములకు గురైనప్పుడే నీవు ఉన్నతస్థాయియందు ఉండగలవు. కనుక కష్టములే కష్టములే అని మనము ఏమాత్రము కూడను నిరాశకు గురికాకూడదు. కష్టములను ఎదుర్కొని మనము సాధించటానికి ప్రయత్నించాలి. కనుక ఇలాంటి కష్టములు మనము గురైనప్పుడు కొంతవరకు దైవముయొక్క బలమును ప్రేమతత్వాన్ని మనము అభివృద్ధి పరచుకోవాలి.

ప్రతి మానవునియందు ఒక విపరీతమైన వికారమైన గుణము ఉంటున్నది. ఇది ఒక రోగము. ఎలాంటి ఔషధమునకు నయమయ్యేది కాదు. ఏ డాక్టరు కూడను దీనిని డయాగ్నైజ్ చేయలేదు. ఐతే ఇది ఏ రోగము అహంకారము. ఈ అహంకారము మానవుని శిరస్సులో చేరి అనేకవిధములుగా ఇతనిని ఆడిస్తూ వస్తున్నాది. ఇది కేవలము మానవునకు మాత్రమే కాదు. పశుపక్షి మృగాదులకు కూడా ఉంటున్నది. ఎవరైనా మనిషిని చూస్తే కుక్క భౌభౌమని అరుస్తుంది. పంది దగ్గరకు వస్తే గుర్ గుర్ మని అరుస్తుంది. ఇవన్నీ అహంకారములయొక్క లక్షణాలే. ఒక వ్యక్తి బజార్లో నడుస్తూ ఉన్నాడు. ఒక శ్రీమంతుని ఇంటిముందు ఒక కుక్క ఉంది. తన జోలికి ఏమీ పోలేదు. కానీ బజర్లోపోయే వారినందరిని చూచి భౌభౌమని అరుస్తుండాది. అంటే ఏమిటి? ఇది నా ఇల్లు దానికి యజమానిని నన్ను తప్పించి మీరు లోపలికి పోవటానికి వీలులేదు అనే అహంకారమే యీ ప్రదర్శనకు మూలకారణము. నా ఇల్లు నేను అనుకుంటుందేగాని నేను అనేది ఏమిటో తనకు అర్థముకాదు. ఆ నేను అనేది దానికి తెలియదు. అదేవిధముగా ఈనాటి మానవుడు కూడను నేను అనేది తెలియనప్పుడు వాడు కుక్కతో సమానము. ప్రతిక్షణము my body, my mind, నా చిత్తము, నా అంతఃకరణము అనేప్రశ్న ఎవరైనా వేసుకుంటున్నాడానేనంటే ఎవరని. కనుక నేను అనే తత్వము గుర్తించుకున్నవాడే జ్ఞాని. నేను అని ఉపయోగపెట్టుకుంటూ దాని అంతరార్థము గుర్తించనివాడే అజ్ఞాని.

వేదాంతము. ఏమిటి ఈ వేదాంతము? గొప్ప విద్యావంతుని దగ్గరకుపోయి వేదాంతము

srisathyasaivachanamrutam

అంటేఏమిటి వేదమునకు అంత్యముజ్ఞానము అంటారు. ఉపనిషత్తులంటారు. ఇది కాదు వేదాంతము. నేను నేనటువంటి నేను యొక్క అంత్యమే వేదాంతము. నేను నేనై పోవటమే వేదాంతము. నన్ను మీరు తెలుసుకోవాలంటే మిమ్మల్ని మీరు తెలుసుకున్న తరువాత నన్ను తెలుసుకోటానికి వీలౌతుంది. కనుక నిన్ను నీవు చూచి నన్ను చూడు. నిన్ను నీవు చూచుకోకుండా నన్ను చూడటము వలన ఏమాత్రము అర్థము కాదు. కనుక బాహ్యదృష్టి యందు తత్త్వాన్ని మనము అభివృద్ధి పరచుకొని దివ్యత్వమును అర్థము చేసుకోవాలంటే ఇది అసాధ్యము.

**ఈశ్వరునికి మూడు ఆకారములున్నాయి**

ఒకటి విరాట స్వరూపుడని రెండవది హిరణ్యగర్భుడని మూడవది అవ్యాకృతుడు. ఈ మూడింటి అర్థము మనము చక్కగా గుర్తించుకుంటే ఈ ముమ్మూర్తి స్వరూపుడు ఎవరనేది మనకు అర్థమవుతుంది. విరాట స్వరూపుడు ఎవరు? అర్జునునికి విశ్వాన్నంతా చూపినాడట అని అనేకరకములుగా ఈ మూర్ఖత్వమైన అర్థములోనే మనము పడిపోతున్నాము. విశ్వస్వరూపుడు. దృశ్యకల్పితమైన ఈ ప్రపంచమంతయు విరాటస్వరూపమే. అనేక రూపనామములతో కూడిన ఈ స్వరూపమే విశ్వస్వరూపము. నానా రూపములతో కూడి నానా భావములతో కూడి నానాత్వము లోపల మునిగిన ఈ దృశ్యకల్పితమైన జగత్తే విరాట్స్వరూపము. దీనినే జాగ్రత్ స్వరూపుడు అన్నారు.

ఇంక స్వప్న స్వరూపుడు. అతడే హిరణ్యగర్భుడు. జాగ్రత్తలో మనము చేతులతో కాళ్లతో పనిచేస్తున్నాము. కన్నులతో చూస్తున్నాము. చెవులతో వింటున్నాము. నోటితో మాట్లాడుతున్నాము. కానీ స్వప్నావస్థలోపల మనము ఎన్నో పనులు చేస్తున్నాము. ఆ చేతులు ఎక్కడివి. ఎంతో ప్రయాణము సలుపుతున్నాము. ఆ కాళ్లు ఎక్కడివి. ఎంతమందితో మనము మాట్లాడుతున్నాము నోరు ఎక్కడిది. ఎన్నో చూస్తున్నాము ఆ కన్నులెక్కడివి. మన ఈ దేహమునకు సంబంధించిన సర్వాంగములు కూడను స్తంభించి ఉన్నవి కదా స్వప్నములో ఇన్ని అనుభవించే అంగములు ఏమిటి? అక్కడే హిరణ్యగర్భుడు. అక్కడే నిజమైన స్వప్న దర్శనము. అదే సూక్ష్మస్వరూపము. అక్కడే అక్కడికక్కడ పుట్టింప చేస్తున్నాది. సమస్త కర్మలు ఆ స్వప్నమునందే ఆచరింప చేస్తున్నాది. అనగా అంతర్ముఖమైన భావముతో కూడిన చైతన్యము కనుక దీనికి

sri sathyasai vachanamrutam

హిరణ్యగర్భుడని పేరుపెట్టారు.

ఇంక కారణ స్వరూపుడైనవాడే అవ్యాకృతుడు. అతనికి ఆకారము లేదు. ఆకారములేనివాడు కాబట్టి అవ్యాకృతుడు అని ఇతనికి పేరు. కానీ ఆనందము ఉన్నది. అనుభూతి వున్నది కనుక స్థూల, సూక్ష్మకారణ స్వరూపులే విరాటస్వరూపుడు, హిరణ్యగర్భుడు, అవ్యాకృతుడు. ఈ మూడు ఎవరి యందు ఉంటున్నవి? ఎక్కడ ఉంటున్నవి? అన్నింటికి మనమే మూలకారణము జాగ్రత్తలో అన్నీ చూచి అనుభవించే వాడూ నీవే. స్వప్నావస్థలో అనుభవించేవాడూ నీవొక్కడే. సుషిప్తి యందు ఆనందించేవాడూ నీ ఒక్కడే. కనుక త్రికాలములందుకూడను ఏకత్వమును పొందిన ఆత్మస్వరూపము ఒక్కటే. జాగ్రత్తలో దేహమునందు స్వప్నములో మనస్సునందు, సుషుప్తిలో చిత్తమందు మూడింటి తత్త్వములను ఏకత్వముగా భావించినటువంటి దివ్యత్వమే ఈశ్వరత్వము.

శివరాత్రి అనగా మంగళకరమైన రాత్రి అని మనము భావిస్తున్నాము. ఈ శివుడు ఎక్కడ ఉంటున్నాడు. ఒకరు చెబుతారు కైలాసములో ఉంటున్నాడు శివుడని. వైకుంఠములో ఉంటున్నాడు శివుడు. స్వర్గములో ఉంటున్నాడు శివుడు. తిరుపతిలో ఉంటున్నాడు శివుడు. కాశీలో ఉన్నాడు శివుడు. పర్తిలో ఉన్నాడు శివుడు అబ్బొబ్బో ఎన్ని రకాలుగానో ఎడ్రస్సులు ఇస్తూ వుంటారు. ఇవన్నీ కూడను కేరాఫ్ ఎడ్రసులు మాత్రమే. నిజమైన ఎడ్రస్సు ఒకటి ఉంది. ఈశావాస్య మిదం సర్వమ్. ఎక్కడ చూచినా ఉన్నాడు భగవంతుడు. కనుకనే మమైవాంశో జీవలోకే జీవ భూతస్సనాతనః అని. భగవంతుడు లేని ప్రదేశముగాని వస్తువుగానీ జగత్తులో లేదు. కానీ నీ భావము మాత్రమే మార్పుచేసుకోవాలి. ఈ ఏకత్వమును నీవు గుర్తించాలి. ఆ దివ్యత్వమును గుర్తించినప్పుడే ఆత్మతత్త్వము నీకు అర్థమవుతుంది. త్రోవ వెతుక్కోవాలి. ఏ త్రోవ మనము వెదకటము. ఎక్కడ నుండి వచ్చామో అక్కడకుపోయే త్రోవ వెతుక్కోవాలి. మనము ఆత్మభావము నుండి వచ్చాము. బ్రహ్మ నుండి మనము వచ్చాము. తిరిగి బ్రహ్మను చేరటానికి త్రోవ వెతకాలి. చాలామంది వస్తూఉంటారు స్వామీ మాకేమైనా ఒకమార్గము చెప్పండి అంటూఉంటారు. ఎక్కడ నుండి వచ్చావో అక్కడికి పోతుంటే చాలు ఇంక నేను చెప్పనక్కరలేదు. భాగవతము కూడను ఎచ్చట పుట్టినవాడచ్చటకేగుట నైజము ప్రాణికోటికిన్ అన్నది.

srisathyasaivachanamrutam

**అంతా భగవత్స్వరూపమే**

ప్రేమస్వరూపులారా! ఈ వర్షము ఎక్కడ నుండి వస్తున్నాది. మేఘము నుండి వస్తున్నాది. ఈ మేఘములు ఎక్కడ నుండి వచ్చాయి. సముద్రము నుండి ఆవిరిగా మారి వచ్చినాయి. కనుక సముద్రము నుండి ఆవిరిగామారి, ఆవిరియే మేఘములుగా మారి, మేఘములే వర్షముగా కురిసి ఈ వర్షమే వంకలుగా వచ్చి వంకలే నదులుగా వచ్చి ఎక్కడ చేరుతుండాది? తిరిగి సముద్రములో చేరిపోతున్నాది. తిరిగి సముద్రములోనే చేరుతున్నాది. ఒక మట్టికుండ మన చేతిలో వుంది. మట్టికుండతో అనేక పనులు మనము చేసుకున్నాము. అనుకూలములు చేసుకున్నాము. చేయి జారి క్రిందపడింది. పగిలిపోయింది. పగిలిందని అక్కడ వదలిపెట్టాము. అందరూ నడుస్తూ నడుస్తూ కొన్ని దినముల లోపల అది మట్టిగా మారిపోయింది. ఈ కుండ మొట్టమొదట ఎక్కడ నుండి వచ్చింది.

ప్రేమస్వరూపులారా! ఈ ప్రపంచమంతయు కేవలము ఒక అగ్ని ball వంటిది ఈ ball లోపల అగ్ని ఎక్కడ ఉంది. లోపల వెలుపల సర్వత్ర ఉంటున్నాది. కనుక దీనిని పురస్కరించుకొనియే వేదము, స్మృతులు, ఇతిహాసములు, పురాణములు అన్నియుకూడను అంతర్బహిశ్చ సర్వవ్యాప్య నారాయణ స్థితః లోపల వెలుపల సర్వత్రా ఉంటున్నాడు. సర్వత్రా ఉండిన భగవంతుని వెతికేది ఎక్కడ. అన్వేషణ అన్వేషణ అనుకుంటున్నాము ఎక్కడో ఒక ప్రదేశమునందు, ఒక్క కాలమునందు ఉండినప్పుడే మనము వెదకటానికి వీలవుతుంది. సర్వత్ర సర్వవ్యాప్తియై ఉండే భగవంతుని వెతికేది ఎక్కడ. వెతకటమే చాలా తప్పు. తనయందు రాగద్వేషములను దూరము చేసుకుంటే తాను తానుగానే ప్రకాశిస్తాడు. ఈ రాగద్వేషములే మరుగు చేస్తున్నాయి. తనయొక్క ఆనందమును కప్పివేస్తున్నాయి. ఆ కప్పబడిన మూతను తెరుచుకోటమే ప్రయత్నం. అదియే ఈనాడు మనము చేయవలసిన సాధన. దైవము తానుగానే ఉన్నాడు. కనుక మానవునియొక్క తత్త్వము దేనికి మనము ప్రయాణము చెయ్యాలి. ఎక్కడకు మనము ప్రయాణము చెయ్యాలి. దీనికై చక్కగా పోతన వ్రాశాడు.

**దీనశుభము లేదు దివ్యకీర్తియు లేదు**
**జగతి బుట్టి పుట్టి చచ్చి చచ్చి**

srisathyasaivacharamrutam

**పొరలనేల మనకు బుట్టని చావని**
**త్రోవ వెదకి కొనుట దొడ్డ బుద్ధి**

అన్నాడు. ఇదియే ద్వాదశాక్షర మంత్రము. త్రోవ వెదకుకొనుట దొడ్డ బుద్ధి. ఇవి 12 అక్షరాలు. మట్టినుంచే వచ్చింది. మట్టిలోకే చేరిపోయింది. మట్టినుండి వచ్చి మట్టిలోకి చేరిపోతన్నది. నీరు వచ్చి నీరులో చేరిపోతున్నాది. అగ్ని వచ్చి అగ్నిలో చేరిపోతున్నాది. ఆకాశము వచ్చి ఆకాశములో చేరిపోతున్నాది. కానీ మానవుడు వచ్చి మానవుడుగానే నిల్చిపోతున్నాడు. వీడు వచ్చిన స్థానాన్ని మరచిపోతున్నాడు. తన కర్తవ్యమేమిటో తాను గుర్తించుకో లేకపోతున్నాడు. what is the purpose of life? నా జీవితము యొక్క లక్ష్యము ఏమిటనే విచారించుకో లేకపోతున్నాడు. ఒక శ్రీమంతుడు వచ్చి నన్ను అడిగాడు. what is the purpose of life అని. అతను ఉత్తరప్రదేశము వాడు. నేను చెప్పాను. ఖానా, పీనా, సోనా, మర్‌నా అన్నాను. తినటము, త్రాగటము, నిద్రించటము, చచ్చిపోవటము ఇవి నాలుగే నీ లక్ష్యములన్నాను. ఇవి కేవలము పశుపక్షిమృగాదులు కూడా చేస్తూనే ఉన్నాయి. ఇంక వీటికంటె మానవుడు ఉత్కృష్టుడు అని ఎట్లు చెప్పగలవు. జంతూనాం నరజన్మ దుర్లభమ్. మానవుడు చాలా ఉత్కృష్టమైనవాడు దుర్లభమైనవాడు. ఎట్లా దుర్లభము. డబ్బు సంపాదించటములోదుర్లభము. దీని కోసమేనా మనము పుట్టటము. కాదు కాదు. ధనము లేనివాడు బ్రతకటం లేదా? అయితే మన జీవితమునకు అవసరమైన ధనము అవసరమే. కాని మితిమీరి ఉండటం వలననే మతి చెడిపోతున్నది. తనయొక్క జీవితగమ్యమును తాను గుర్తించటానికి ప్రయత్నించాలి. విజ్ఞాన సుజ్ఞాన ప్రజ్ఞాన అని పేరు ప్రతిష్ఠలు పొందిన మానవుడు మృగములవలె జీవించటమా? ఇది కేవలము మానవత్వమునకే తలవంపులు. వాదములో మన బలమునంతా ప్రదర్శిస్తున్నాము. ఈ తర్కవాదములో మన జీవితమునంతా వ్యర్థము చేస్తున్నాము. గొప్ప చదువరినని విఱ్ఱవీగుతున్నాము. ఇది కాదు మన నిజమైన గుణముయొక్క ప్రభావము. మన తత్వాన్ని గుర్తించి మనము వర్తించాలి.

**మమకారమే కష్టాలకు కారణము**

మానవుడంటే ఏమిటి? దీని అర్థము ఆ పదమునందే ఉంటున్నది. మా-న-వ. మా

srisathyasaivachanamrutam

అనగా అజ్ఞానము. న అనగా లేకుండా. వ-వర్తించటము. ఆ పదమునందే ఉంటున్నాది ఇంకొకరు నీకు చెప్పనక్కర లేదు. అజ్ఞానము లేకుండా వర్తించేవాడే మానవుడు. అజ్ఞానము అంటే ఏమిటి? తాను కానటువంటి దానిని తానుగా భావించుకోటమే అజ్ఞానము. తాను దేహము కాదు. తాను కానటువంటి దేహాన్ని తానుగా భావిస్తున్నాడు. తాను మనస్సు కాదు. తనది కాని మనస్సును తనదిగా భావిస్తున్నాడు. ఇట్టివాడే ధృతరాష్ట్రుడు. తనది కానటువంటి దానిని తనదిగా భావించుకోటమే అజ్ఞానము యొక్క లక్షణము. అయితే ఉండినంతవరకు దేహమును పోషించుకోవలసినదే. మనసు నిగ్రహించుకోవలసిందే. కర్తవ్యమును నిర్వర్తించవలసిందే. జీవితనావ నడపవలసిందే. అయితే మమత్వమును మాత్రము కొంతవరకు తగ్గించుకోవాలి. ఈ మమత్వము ఉండినంతవరకు వానిని అశాంతి వెంటాడుతూనే ఉంటుంది. ఎవరో ఒక పల్లె మనిషి ఏదో కొంతదూరము టౌన్‌లో తనబిడ్డను ఇచ్చి పెండ్లి చేయటంచేత తన బిడ్డను చూడటానికి వెళ్లుతూ ఉండినాడు. భీదవాడు. భార్య చెప్పింది 'ఏమిటండీ మన చెఱుకు తోటలో చెఱుకు ముక్కలున్నాయి కదా కొన్ని తుండ్లు కొట్టి తీసుకుపోయికొన్ని బిడ్డకు ఇయ్యండి' అని చెప్పింది. కట్టకట్టుకున్నాడు. రైల్వేస్టేషనుకు వెళ్లాడు. టిక్కట్టు తీసుకున్నాడు. చెఱకు కట్టతో బాటు రైలు ఎక్కాడు. స్థలము లేకపోతే ఏదో ఒకమూల దానిని పెట్టాడు. తాను ఒక చోట కూర్చున్నాడు. టిక్కట్టు కలక్టరు వచ్చాడు. వాడు ఏదోరీతిగా పొందాలి కదా ధనము. అందువల్ల అటు ఇటూ చూచి చెఱకు కట్ట ఎవరిది అన్నాడు. అంతటితో మాటలు విరమించలేదు. దీనికి లగేజి ఛార్జీ కట్టాలన్నాడు. లగేజి ఛార్జీ అనేటప్పటికి ఇతను ఏమీ నోరు తెరచలేదు గమ్మునున్నాడు. ప్రక్కన ఉన్నవాడు కొంచెము యుక్తి పరుడు. ఎవరు చెప్పలేదు కదా అని ఆ కట్ట నాదేను అన్నాడు. అయితే దీనికి ఐదురూపాయలు సుంకం కట్టాలన్నాడు. ఐదు రూపాయలు కట్టాడు. కట్టను దగ్గర పెట్టుకున్నాడు రెండవ మనిషి. సరే దిగే సమయము లోపల ఆ owner కట్టను తీసుకొనిదిగాడు. దీనికి సుంకము కట్టినవాడు ఇదినాకట్ట అని ఇద్దరూ పోట్లాడుకున్నారు. చెఱుకు కట్టనాది. ఛార్జీ కట్టినది వాడు. ఇద్దరూ పోట్లాడుతుంటే పోలీసువారు వచ్చారు. న్యాయంగా చెప్పమని ఎవరిదీ చెరకుకట్ట. ఇది నాది అన్నాడు owner దీనికి tax ఎవరు కట్టారు? నేను కట్టాను అన్నాడు రెండవవాడు. నిన్ను ఎవరు కట్టమన్నారు? ఎవరు మాట్లాడలేదు. ఆ చెఱకుకట్ట నేను తీసుకుపోదామని కట్టినాను' అన్నాడు. ఈ అభిమాన

srisathyasaivachanamrutam

మమకారములే నీకింత నష్టానికి కష్టానికి కారణము. పోలీసువాడు ఆ సుంకము కట్టిన వానిని దూరము పొమ్మని ఈ ownerను తీసుకుపొమ్మన్నాడు. ఏదో పాపం తాను కూడా రెండు చెఱకులు తీసుకొని వెళ్ళాడు. ఈ విధముగా మానవునికి చిన్న చిన్న విషయమునందు కూడను మమకారము, మమకారము ఏమిటీ మమకారము. ఇంత మమకారం పెంచుకోవటం చేతనే మానవుడు అనేక విధముల అశాంతికి గురౌతున్నాడు.

## దైవ విశ్వాసమే శ్వాసగా ఉండాలి

కనుక భగవత్ తత్త్వాన్ని తాను మొట్టమొదట తాను గుర్తించుకోవాలి. నేనే భగవంతుడను అనే విశ్వాసమును బలపర్చుకోవాలి. శివుడంటే ఎవరు? ఒక చిన్న ఉదాహరణము మనము తీసుకుందాము. జీవితము లోపల అన్ని విధముల అనుభవించి ఒక శరీరము ప్రాణమును వదలింది. ఈ మృతదేహమును చూచి శవము అంటున్నాము. జీవించిన దేహము చూచి శివము అంటున్నాము. శివమునకు, శవమునకు వుండిన వ్యత్యాసము ఏమిటి? శివములో స్వస్వరూపమైన శ్వాస ఉంటున్నది. శవములో శ్వాసము లేదు. శ్వాసము లేనటువంటిదే శవము. శ్వాసము ఉన్నటువంటిదే శివము. ఈ శ్వాసము అంటే ఏమిటి? విశ్వాసము. దైవవిశ్వాసము ఉండినటువంటిదే శివము. దైవ విశ్వాసములేనిదే శవము. అనగా ఏమిటి? తనయందే ఈ శ్వాసము స్వస్వరూపము. సో-హం; సో-హం. ఈ విధముగా ఉచ్ఛ్వాస నిశ్వాసములతో తన తత్త్వాన్ని తాను నిరూపిస్తూ ఉంటున్నాడు.

సోహం అనగా ఏమిటి? సో అనగా ఏమిటి? That హం అనగా ఏమిటి? నేను. ఇదే తత్త్వమసి అని. అదే అహం బ్రహ్మాస్మి అనే మహావాక్యము. ఇది ఏ విధముగా మనకు బోధిస్తున్నది. ఎన్ని పర్యాయములు బోధిస్తున్నది. ఒక్క దినమునకు 21,600 పర్యాయములు సోహం నేనే దైవమును అని మనకు బోధిస్తూ ఉంటున్నాది. దీనిని మనము లక్ష్యము చేయటం లేదు. ఎక్కడో పుస్తకాలలో ఉన్న విషయాన్ని మస్తకాల్లో చేర్చుకుంటున్నాము. మస్తకాలో ఉంచిన దానిని ప్రాక్టికల్‌లో పెడుతున్నామా? ఇంక ఈ bookish knowledge వలన ఏమి ప్రయోజనము. కనుక మా పిల్లలకంతా చెప్తూ ఉంటాను. knowledge అనేది ఐదురకములు. పిల్లలారా ముఖ్యముగా ఈ bookish knowledge అనేది ఏమీ

ప్రయోజనం లేదు. ఇది కేవలము ఒక superficial knowledgeగా ఉంటుంది. దాని తరువాత general knowledge కావాలి మనకు ఈ general knowledge తరువాత discrimination knowledge కావాలి మనకు. విచారణా శక్తి. తరువాత ఐదవదే practical knowledge ఈ practical knowledge మనం పొందాలంటే మొట్టమొదట మనము ఏవిధముగా ప్రయత్నము చెయ్యాలి. అక్కడ త్యాగము చెయ్యాలి. త్యాగము చేసినప్పుడే మనకు devotion అభివృద్ధి అవుతుంది. ఈ devotion వచ్చేటప్పటికి discipline ప్రారంభమవుతుంది. ఈ discipline ప్రారంభమైన discrimination వస్తుంది. ఆ తరువాతనే determination అప్పుడే పట్టుదల వస్తుంది. కనుక మొట్టమొదట dedication మొట్టమొదట అర్పితము గావించాలి. ఏమిటి మనము అర్పితము చెయ్యాలి.

**అహంకారమును అర్పితము చెయ్యండి**

ఇది మనసా, దేహమా, నీ ధనమా ఏమిటి నీవు అర్పితము చెయ్యాలి. ఏమీ భగవంతుడు కోరటం లేదు. భగవంతుడు ఎవరిదీ ఏవిధముగా ఆశించడు. నీవు అర్పితము చేయవలసినది కల్పితమైన అహంకారమే. అది నీవెంట జంట ఇంట ఉండినంతవరకు నిన్ను ఏమాత్రము సుఖపెట్టదు. కనుక ఈ అహంకారము ఎప్పుడు అర్పితము చేస్తావో అప్పుడే నీలో ప్రేమ ప్రారంభమవుతుంది. అదే devotion ఈ ప్రేమతత్త్వము అభివృద్ధి అయ్యేటప్పటికి అక్కడ కొంతవరకు ఏది అనిత్యము ఏది సత్యము ఏది ఆత్మ ఏది అనాత్మ అని discrimination వస్తుంది. ఆ discrimination లైము లోపల discipline చక్కగా పాటిస్తావు. ఈ నాల్గింటి కూడిక చేత నీకు determination నమ్మకము దృఢముగా కలుగుతుంది. మనలో అహంకారము ఉండినంతవరకు ఏ సుఖము ఉండదు. సుఖము లేకపోతే నీకు కష్టములు అధికముగా వస్తాయి.

కొంతమంది పిల్లలుచేరి foot ball ఆడుతున్నారుట. ఒక గురువు శిష్యుడు చూస్తూ కూర్చున్నారు. ఈ శిష్యునికి చూచి చూచి విసుగు పుట్టిపోయింది పాపం. గురువు దగ్గరకు వెళ్లి గురూజీ! ఏమిటి ఈ foot ball చేసిన పాపం. ఎవరి దగ్గరకు వచ్చినా దినిని వెంటబడి కాళ్లతో కొట్టి పంపుతున్నారు. ఏ వ్యక్తి చూచినా చేతితో కొట్టటం లేదు. కాళ్లతోనే కొడుతున్నారు.

sri sathyasai vacharamrutam

ఈ పాపము ఏమిటి స్వామీ అని అడిగాడు. గురువు చెప్పాడు. 'నాయనా! దీని లోపల ఏముందో తెలుసునా! గాలి ఉంది. అదే అహంకారము. అది ఉండినంతవరకు కూడను. కామ క్రోధ లోభ మద మాత్సర్యములనే అరిషడ్వర్గముల కాళ్లదెబ్బలు తప్పినవికావు. ఈ దుర్గుణములంతా కూడను దానిని నిరంతరము కాళ్లతో తంతూనే ఉంటున్నాయి. ఈ ఆటలోపల అరిషడ్వర్గములు ఒకవైపున సత్య ధర్మ ప్రేమ శాంతి అహింస ప్రకృతి ధర్మములు ఈ ఆరుగురు ఒకవైపున వీరు వారు దానిని కొట్టేస్తున్నారు life అనే foot ballని అహంకారమనే foot ballని. ఇటువైపున అటువైపున ఒక్కొక్క గోల్స్ ఉంటున్నాయి. అదే ఇహమును సుఖింప హేమతారక విద్య పరమును సుఖింప బ్రహ్మ విద్య, ధర్మ విద్య, బ్రహ్మ విద్య రెండు గోల్సు. ఈ రెండింటి మధ్య ఈ బాల్‌పోతే గోల్ అయింది. ఈ రెండింటిని తప్పి అవతలపోతే out అయిపోయింది. కనుక మన జీవితమనేది కొడుతూ కొడుతూ ఈ ధర్మమునకు బ్రహ్మమునకు అతీతముగా పోకూడదు. దీనికి లొంగి అదుపులోనే మనము వెళ్లాలి.

దివ్యాత్మస్వరూపులారా! మానవత్వమును ఎక్కడో ఏదో ఒక విధముగా మీరు భావించరాదు. దైవత్వమే మానవత్వము, దైవం మానుషరూపేణ. మనుష్య రూపములో ఉన్న దైవమే ప్రధానమైనది. ఈనాడు కేవలము మూర్ఖత్వము చేతనే సజీవులను బాధించటము నిర్జీవులను పూజించటము జరుగుతూ ఉంటున్నాది. కనుక దైవమును పూజించటమంటే సర్వత్రా ఉండిన ఐకమత్యమును బలపర్చాలి. భగవంతుడు సర్వత్రా ఉంటున్నాడు. రాయిలో ఉన్నాడు, రప్పలో ఉన్నాడు, చెట్టులో ఉన్నాడు, పుట్టలో ఉన్నాడు, గుట్టలో ఉన్నాడు. అన్నింటియందు ఉండిన ఏకత్వము మనము విశ్వసించాలి. దేనికి తగిన స్థానము దానికి అందించాలి. ఏ ఒక్క దానిని మనము విసర్జించరాదు. ఎవరిని మనము దూషించరాదు. అదే మనలో ఉన్న ప్రధానమైన గుణము. అలాంటి ఉత్తమగుణము మనము అభివృద్ధి గావించుకున్నప్పుడే చిత్తము పరిశుద్ధమవుతుంది. చిత్తశుద్ధి లేనివాడు ఎన్ని చేసినా ఏమి ప్రయోజనము లేదు. కనుక మనలోఉన్న ప్రేమతత్త్వమును ప్రేమ నిమిత్తమై మనము ప్రాకులాడి ప్రేమకే సంపూర్ణమైన అర్పితము గావించాలి. Love is God Live in Love. మీరు ప్రేమనే ఆశ్రయించి ప్రేమనే దైవముగా భావించుకొని ప్రేమలోనే మీరు అర్పితము కావాలి. అనేక పర్యాయములు చెప్పాను.

sri sathyasaivachanamrutam

Start the day with love
Fill the day with love
Spend the day with love
End the day with love
This is the way to God.

కానీ ప్రేమతోనే మనము భగవంతుని పొందాలి. ఈ ప్రేమస్వార్థము, స్వప్రయోజనము కాకుండా దైవత్వముగా మనము భావించటానికి పూనుకోవాలి. కనుక ప్రేమతో పరమాత్మని చింతించండి. ఈనాడు మహాశివరాత్రి. రాత్రి అనగా చీకటితో కూడినది. అనగా చీకటితో కూడిన దీంట్లో దివ్యత్వమైన ప్రకాశమైన పేరును తలచాలి. అదే భగవన్నామము.

**ఆత్మస్వరూపుడే భగవంతుడు**

అసలు దేవుడంటే ఏమిటనే విషయమును కూడను మనము గుర్తించాలి. రాత్రి పగలుతో కూడినది దినము. దినము కానటువంటిదే దేవుడు. అనగా రాత్రి పగలు కానటువంటివాడే దేవుడు. రాత్రి పగలు భూమిపైన ఉండినవారికే. భూమధ్యరేఖపైన సూర్యుడు వచ్చినప్పుడు పగలు అవుతున్నాది. భూమధ్యరేఖకు క్రిందకు దిగిపోయినప్పుడు రాత్రి అవుతున్నది. రాత్రి పగలు నీదృష్టిలో గాని భగవంతునికి రాత్రి పగలు లేవు. సమిష్టి స్వరూపుడే భగవంతుడని. అందరియందు ఉండిన ఆత్మస్వరూపుడే భగవంతుడు. కనుక ఎవరిని చూచినా మనము గౌరవముగా మర్యాదగా పలుకరించి వారికి గౌరవాన్ని అందించాలి. దీనికోసమే చెప్తూ ఉంటాను. You cann't always oblise but you speak always oblisingly. మనము భక్తి అనేదానిని పెడమార్గమును పట్టిస్తున్నాము. తెల్లవారి లేస్తే ఒక ఐదునిముషములు ప్రార్థన చేయటము ఇది భక్తి అని, ఫోటో పెట్టుకోటం భక్తి అని పూజలుచేయటం భక్తి అని యాత్రలుపోవటం భక్తి అని ఇవి మనము భావిస్తున్నాము. భక్తి అనగా కృతజ్ఞతే.

ఓ భగవంతుడా! ఇంత అపూర్వమైన మానవత్వమును నాకు అనుగ్రహించావు. శరీర నిర్మాణమునందే కాకుండా మేధాశక్తియందు కూడా. అనేక విధములైన జంతువుల నుండి ఉత్తమమైన మార్గానికి పంపించావు అందు నిమిత్తమై నీకు కృతజ్ఞత చూపాలి. ఈ జన్మ ఇచ్చినందుకే కృతజ్ఞత తెల్పాలి. ఒక కర్చీఫ్ పడితే దానిని ఎత్తి ఇస్తే thanks అని అంటుంటాం



srisathyasaivachanamrutam

మనము. ఇంటికిపోతే ఇంత కాఫీ ఇస్తే thanks అంటున్నాము. దీనికి మనము ఇంత thanks అనుకుంటుంటే భగవంతుడు ఎంత అనుగ్రహించాడు మనకు. ఎన్ని పంపుసెట్లు పెట్టి కొడితే కుంభ వర్షానికి సమానంగా వస్తుందా! ఒక్క కుంభవర్షం కురిసిందంటే వంకలు కాల్వలు నిండి ప్రవాహంగా పారుతూ ఉంటాయి. ఈ కుంభవర్షము కురిపించిన వారెవరు? ఎంత క్యాండిల్ బల్బుపెడితే సూర్యుని ప్రకాశము సాటి అవుతున్నదా. ఎన్ని ఫ్యానులు పెట్టినాగానీ మలయమారుతము వీస్తుందా. ప్రపంచమునకు ఇంతగాలిని అందిస్తున్నది ఎవరు? ప్రపంచమునకు ఇంత వెలుతురు నందించినది ఎవరు? ప్రపంచమునకు ఇంత జలము నందించినది ఎవరు? ఇన్ని అందించిన భగవంతునికి మనము కృతజ్ఞత చెప్పనక్కర లేదా? ఈ కృతజ్ఞత లేనివాడు మృగముకంటె హీనమని చెప్పవచ్చు. భగవంతుడు యిన్ని విధముల పోషిస్తూ రక్షిస్తూ కాపాడుతున్నప్పుడు అతనికి కొంతవరకునైనా thanks చెప్పాలి. అది నీ duty. కనుకనే Duty is God Work is Worship అన్నారు. నీ duty నీవు చేయటమే కృతజ్ఞత.

మన కర్తవ్యమును మనము నిర్వర్తించాలి. ధనము అధికముగా అయిపోయేటప్పటికి మదము ఎక్కుతూ ఉంటుంది. అసలు ఈనాడు ధనము కోరే వ్యక్తులే అధికముగా ఉంటున్నారు. మన ధనము ఏమిటి? జ్ఞాన ధనమే ధనము. ప్రేమ ధనమే నిజమైన ధనము. ఆనంద ధనమే నిజమైన ధనము. ఈ ధనమంతా ఏమి చేస్తుంది. గొప్ప భవనాల్ని కట్టించవచ్చు. ఫ్యాక్టరీస్ పెట్టవచ్చు. కార్లు కొనవచ్చు. కానీ భగవంతుని కొనేందుకు అవుతుందా? నీవు రోగానికి మందుకొనవచ్చును. రోగము నివారణ అవుతుందా. అనిల్ కుమార్ చెప్పాడు ఎన్ని విధములైన మందులు తీసుకున్నప్పటికి భగవంతుని అనుగ్రహమే లేకపోతే ఆ యొక్క జీవితము నిల్చటానికే వీలులేదు. నిజముగా ధనము మనకు అనేక అనుకూలములు చేస్తుంది. air condition అందిస్తుంది. కానీ మానసిక శాంతి నందిస్తుందా? కనుక మానసిక శాంతే మానవునికి ప్రధానమైన లక్ష్యము. ఆ శాంతి ఎక్కడా లభించదు. ఒక్క భగవత్ప్రేమయందు మాత్రమే లభిస్తుంది. ఆ ప్రేమలో ఉండిన భావము, ఆ ప్రేమలో ఉండిన శక్తి సామర్థ్యములు ఇంత అంత అని చెప్పటానికి వీలుకాదు. ఆ ప్రేమ చేతనే భగవంతుని స్మరించండి.

**(తేది. 06-03-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam